1St Happy Work Anniversary. Year

షణ్ముఖ SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health  Best for Readers  THE POWER OF PEN RK

సంపుటి : 03 సంచిక : 171    ఆదివారం 28 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.




## తిట్ల దండకమే వైకాపా విధానం
### : డిప్యూటీ సీఎం పవన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 27)

వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడుతున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లాడిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించనని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ▶మిగతా 2లో



## మాదకద్రవ్యాల చట్టంలో లొసుగుల్ని తొలగిస్తాం
### రాష్ట్రాలను కోరిన అమిత్ షా

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 27)

మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల (ఎన్‌డీపీఎస్) చట్టాన్ని పునఃపరిశీలించి, అందులోని లొసుగులను తొలగించేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ సవరణల కోసం సూచనలు చేయాలని రాష్ట్రాలను కోరారు. దిల్లీలో శుక్రవారం నిర్వహించిన నార్కో-కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) 10వ అత్యున్నత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. మాదకద్రవ్యాల విక్రేతలు, సరఫరాదారుల ▶మిగతా 2లో

## రౌడీయిజం చేసేందుకే వైకాపా నేతల అమరావతి పర్యటన: అనిత



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 27)

రైతులపై రౌడీయిజం చేసేందుకే వైకాపా నేతలు అమరావతి వెళ్లారని ఏపీ హోంశాఖ మంత్రి అనిత అన్నారు. ఇది ముమ్మాటికీ అమరావతి రైతులపై రౌడీ మూకలతో చేసిన దాడేనని ఆక్షేపించారు. రాజధానిలో వైకాపా నేతల పర్యటన ఉద్రిక్తతలకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఉండవల్లిలో రాజధాని రైతులు, వైకాపా నేతల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ ఘటనపై అనిత స్పందించారు. జరిగిన ఘటనపై అధికారులను అడిగి సమాచారం తెలుసుకున్నట్లు చెప్పారు.

" తెదేపా ఆఫీసుపై దాడి చేసిన గూండాలే రైతులపై దాడికి వచ్చారు. అమరావతి వెళ్లిన వారందరి విజువల్స్ ఉన్నాయి. వైకాపా నేతలకు అమరావతిలో పర్యటించే నైతిక అర్హత లేదు. రైతులను పరామర్శించేందుకు వెళ్లారా? రౌడీయిజం చేసేందుకు వెళ్లారా? వైకాపా నేతలు వెళ్తే సమస్య వస్తుందని పోలీసులు ముందే చెప్పినా వినిపించుకోలేదు. ▶మిగతా 2లో



# నేనే అందరికంటే పెద్ద జెన్ జీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 27)

ప్రజల అండ ఉంటే కొండనైనా ఢీ కొట్టే శక్తి తనకు వస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామన్నారు. కిష్టంశెట్టిపల్లిలో పర్యటించిన ఆయన.. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజలు ఆనందంగా ఉండేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు." ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం సంజీవని లాంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి అన్ని జిల్లాల్లో సంజీవని అమలు చేస్తాం. యోగా, ధ్యానం వంటి మంచి అలవాట్లతో మీ ఆరోగ్యం.. మీ చేతుల్లోనే ఉంటుంది. పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలి.. తాజా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు ఎరువులు తక్కువగా వాడాలి. యూరియా ఎక్కువ వేస్తే పంటను కొనేందుకు సిద్ధంగా లేరు. చాలా మంది ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు.భవిష్యత్‌లో పెద్ద కుటుంబాలను ఆదరిస్తాం. ఇంటి కోసం, రేషన్ కార్డు కోసం పిల్లలు, తల్లిదండ్రుల నుంచి విడిపోతున్నారు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. జనాభా పెరగాల్సిన అవసరం ఉంది. 40 ఏళ్ల తర్వాత ఏం జరుగుతుందో దాని గురించి ఇప్పుడే ఆలోచిస్తాను. నా కంటే ఇన్నోవేషన్ తెచ్చేవారు ఎవరూ ఉండరు. ఇటీవల జెన్ జీ... జెన్ జీ మాట ఎక్కువగా వినిపిస్తోంది. నేనే అందరికంటే పెద్ద జెన్‌జీని. నా కంటే ఇన్నోవేటివ్‌గా ఆలోచించేవారు ఎవరూ ఉండరు. ఇన్నోవేషన్‌తో ముందుకు వస్తే అండగా ఉంటా.పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. ▶మిగతా 2లో



## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్.. రూబియో కీలక ప్రకటన

- వచ్చే ఏడాది భారత్‌లో ట్రంప్ పర్యటనకు అవకాశం
- ఏర్పాట్ల కోసం ఈ ఏడాది రూబియో భారత్‌కు వచ్చే యోచన
- మోదీ-ట్రంప్‌లది అద్భుతమైన అనుబంధమన్న రూబియో
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉందని వెల్లడి
- మోదీ నేతృత్వంలో భారత్ ప్రపంచ శక్తిగా ఎదిగిందన్న రూబియో

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 27)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ-ట్రంప్‌ల మధ్య అద్భుతమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. ఇరు దేశాల సంబంధాలు ▶మిగతా 2లో

## ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట.. ప్రమోషన్లు, బదిలీలపై కీలక నిర్ణయం
### ప్రభుత్వ ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలపై ఫ్రీజింగ్ గడువు జులై 5కు పొడిగింపు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 27)

ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. రాష్ట్రంలో ఉద్యోగుల ప్రమోషన్లు, పోస్టుల అప్‌గ్రేడ్, బదిలీలపై విధించాలనుకున్న ఫ్రీజింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేసింది. ఈ నెల 25 నుంచి అమల్లోకి రావాల్సిన ఈ నిబంధన గడువును జులై 5వ తేదీ వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు సవరణ మెమో జారీ చేసింది.రాష్ట్రపతి ఉత్తర్వులు-2025ను అమలు చేసే ప్రక్రియలో భాగంగా సాధారణ పరిపాలన ▶మిగతా 2లో

## ఎవరెన్ని కుట్రలు చేసినా 'సర్' ప్రక్రియ ఆగదు: కిషన్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 27)



నగరంలో ఎంతో మంది రోహింగ్యాలు అక్రమంగా నివాసం ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారికి ఇక్కడ ఓట్లు, రేషన్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని ఆక్షేపించారు. రామ్‌కోఠిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి.. చిన్నారులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. తర్వాత ఖైరతాబాద్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం భాజపా కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. ▶మిగతా 2లో



## అమరావతిలో పేర్ని నాని తదితర వైసీపీ నేతలపై కోడిగుడ్లతో దాడి

**అమరావతి భూములను పరిశీలించేందుకు వెళ్లిన వైసీపీ నేతలు**
**గో బ్యాక్ వైసీపీ అంటూ కూటమి సానుభూతిపరులు, రైతుల అడ్డగింత**
**లేళ్ల అప్పిరెడ్డి వాహనంపై రాళ్లు రువ్విన రైతులు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 27)

రాజధాని అమరావతి ప్రాంతంలో వైసీపీ సీఆర్‌డీఏ పరిరక్షణ బృందం పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. తాడేపల్లి మండలం ఉండవల్లి సెంటర్ వద్ద వైసీపీ నేతలు పేర్ని నాని, అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు రాజధాని భూములను పరిశీలించేందుకు వెళుతుండగా కూటమి సానుభూతిపరులు, రాజధాని రైతులు వారిని అడ్డుకున్నారు.'గో బ్యాక్ వైసీపీ' అంటూ నినాదాలు చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వైసీపీ నేతలపై కోడిగుడ్లు కూడా విసిరారు. లేళ్ల అప్పిరెడ్డి ప్రయాణిస్తున్న కారుపై రాళ్లు రువ్వడంతో వాహనం దెబ్బతిన్నట్లు సమాచారం. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు జోక్యం చేసుకున్నా ఉద్రిక్తత కొనసాగింది. పోలీసులపై కూడా రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు.

ఉండవల్లి ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



## వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులకు రూ.25వేల కోట్ల బకాయిలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 27)

వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు పెట్టారని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ తెలిపారు. గత రెండేళ్లలో మరో రూ.10 వేల కోట్ల బకాయిలు పెరిగాయని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరులో శుక్రవారం ప్రభుత్వ ▶మిగతా 2లో

## విద్యా వ్యవస్థలో మార్పు.. వెంటనే సాధ్యం కాదు

- విడతలవారీగా అన్నింటినీ పరిష్కరిస్తాం
- ఫలితాలు సాధించే గురువులకు గుర్తింపునిస్తాం
- సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన టీచర్లతో మంత్రి లోకేశ్
- ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 27)

విద్యావ్యవస్థలో ఆశించిన మార్పు తేవడం వెంటనే సాధ్యం కాదని, అందుకు కొంత సమయం పడుతుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విద్యావ్యవస్థలో అన్ని



సమస్యలనూ ఒకేరోజు పరిష్కరించడం సాధ్యం కాదని, ప్రాధాన్యక్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తామని వెల్లడించారు. విద్యపై అధ్యయనానికి ఇటీవల సింగపూర్ వెళ్లి, వచ్చిన 37మంది ఉపాధ్యాయులతో మంత్రి లోకేశ్ ఉండవల్లి

2

## ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 27)

రాష్ట్రవ్యాప్తంగా 49.20 లక్షల మంది 0-5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 68.67 లక్షల వ్యాక్సిన్ డోసులు అందుబాటులో ఉంచినట్లు వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ తెలిపారు. ▶మిగతా 2లో

## నేనే అందరికంటే పెద్ద జెన్ జీ: చంద్రబాబు

వెలిగొండ ప్రాజెక్టు.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం. గొడ్డలి పార్టీకి మద్దతు ఇచ్చేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అమరావతిపై వైకాపా కుట్రలు జరుగుతూనే ఉన్నాయి.అమరావతిని నంబర్ 1 నగరంగా, రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి మా రాజధాని అని కాలర్ ఎగరేసి చెప్పుకొనేలా నిర్మిస్తాం"అని చంద్రబాబు అన్నారు.

## తిట్ల దండకమే వైకాపా విధానం

పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు.మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. "క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తా. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలి" అని పవన్ సూచించారు.

## మాదకద్రవ్యాల చట్టంలో లొసుగుల్ని తొలగిస్తాం

పట్ల కఠిన వైఖరి అవసరమని నొక్కిచెప్పారు. 2004-2014 మధ్య అధికారులు దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కిలోల కృత్రిమ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోగా.. 2014-26 మధ్య రూ.1.84 లక్షల కోట్ల విలువైన 1.18 కోట్ల కేజీల కృత్రిమ మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారని షా తెలిపారు. 'మా ప్రచారం విజయం దిశగా సాగుతోందనడానకి ఇదే సాక్ష్యం' అని పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా.. 'గుర్తించడం, అడ్డుకోవడం, నాశనం చేయడం' అనే మూడంచెల విధానాన్ని షా ఆవిష్కరించారు. దీంతోపాటు 2026-29 కాలానికి గానూ.. మాదకద్రవ్యాల నియంత్రణపై ఒక విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు.

### వందేమాతరం.. దేశ పునర్నిర్మాణానికితోడ్పడే మంత్రం

వందేమాతరం కేవలం దేశభక్తి గీతం కాదని, అది దేశ పునర్నిర్మాణానికి తోడ్పడే మంత్రమని షా అన్నారు. వందేమాతరాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీ జయంతిని పురస్కరించుకొని ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట.. ప్రమోషన్లు, బదిలీలపై కీలక నిర్ణయం

శాఖ (జీఏడీ) తొలుత ఒక మెమో జారీ చేసింది. దీని ప్రకారం ఉద్యోగుల ప్రమోషన్లు, పోస్టుల అప్‌గ్రేడ్, బదిలీల ప్రక్రియపై జూన్ 25 నుంచి ఫ్రీజింగ్ అమల్లోకి వస్తుందని పేర్కొంది. అయితే, ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అమరావతి సచివాలయంలో 16 ఉద్యోగ సంఘాల నాయకులతో అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్యంగా పదవీ విరమణ కారణంగా ఏర్పడే ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసేందుకు వీలుగా ఫ్రీజింగ్‌ను వాయిదా వేయాలని వారు కోరారు.

ఉద్యోగ సంఘాల వినతులను సానుకూలంగా పరిశీలించిన ప్రభుత్వం, ఫ్రీజింగ్ అమలు తేదీని జులై 5కు మారుస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు జీఏడీ తాజాగా సవరణ మెమోను విడుదల చేసింది. జులై 5వ తేదీ లోపు పదోన్నతులు, పోస్టుల అప్‌గ్రేడ్ ప్రక్రియను పూర్తి చేయాలని అన్ని శాఖలను ఆదేశించింది. ముఖ్యంగా జూన్ 30 నాటికి ఏర్పడే ఖాళీలను కూడా పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశాలను వెంటనే నిర్వహించి, అర్హులైన వారందరికీ ప్రమోషన్లు కల్పించాలని సూచించింది. అవసరమైన చోట డిప్యుటేషన్లు, బదిలీలకు కూడా అనుమతి ఇచ్చింది.

### మూడు అంచెల కమిటీల ఏర్పాటు

రాష్ట్రంలో కొత్త జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్లు ఏర్పడిన నేపథ్యంలో ఉద్యోగుల కేడర్ల పునర్వ్యవస్థీకరణ తప్పనిసరి అయింది. ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం మూడు అంచెల కమిటీలను ఏర్పాటు చేసింది.

### మొదటిపేజీ తరువాయి

జిల్లా స్థాయి కమిటీ: కలెక్టర్ ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీ, జిల్లా కేడర్ పోస్టుల కేటాయింపులను పర్యవేక్షిస్తుంది.

శాఖాధిపతుల కమిటీ: సంబంధిత శాఖాధిపతి ఛైర్మన్‌గా ఉండి, జోనల్ కేడర్ ఉద్యోగుల కేటాయింపుల ప్రక్రియను పూర్తి చేస్తుంది.సచివాలయ స్థాయి కమిటీ: ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ లేదా సెక్రటరీ నేతృత్వంలో ఈ కమిటీ పనిచేస్తుంది. ఇది మల్టీ జోనల్ కేడర్ పోస్టుల కేటాయింపులను పర్యవేక్షిస్తుంది.

మొత్తం మీద ఫ్రీజింగ్ గడువును ప్రభుత్వం పొడిగించడం వల్ల పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

## ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలి

ఈ నెల 28న.. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ ఈ చుక్కల మందు వేయాలని స్పష్టంచేశారు. వంద శాతం లక్ష్యం చేరుకొనేలా కీలక శాఖలు సమన్వయంతో పనిచేయాలని నిర్దేశించారు. పల్స్ పోలియోపై ఉన్నతాధికారులతో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ సమావేశం, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం క్షేత్రస్థాయిలో 1.31 లక్షల మంది సిబ్బంది సేవలు వినియోగిస్తున్నట్లు చెప్పారు. నిర్దేశిత కేంద్రాల్లో ఆదివారం ఉదయం పోలియో చుక్కలు వేసి, ఎడమ చేతి చిటికన వేలిపై సిరా గుర్తు పెట్టాలని సూచించారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటి పరిశీలన చేసి చుక్కల మందు వేయించుకోని పిల్లలను గుర్తించి, తప్పనిసరిగా వారికీ వేయాలని ఆదేశించారు.

## వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులకు రూ.25వేల కోట్ల బకాయిలు

ఉద్యోగుల జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు విడతల డీఏ విడుదల చేయాల్సి ఉండగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. పెరిగిన ధరలతో ఉద్యోగుల కుటుంబాల మీద ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగులకు కల్పించాల్సిన ప్రయోజనాలపై ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని డిమాండ్ చేశారు.

## విద్యా వ్యవస్థలో మార్పు.. వెంటనే సాధ్యం కాదు

నివాసంలో సమావేశమయ్యారు. సింగపూర్ పర్యటనలో తెలుసుకున్న అంశాలు, రాష్ట్రంలో వాటి అమలుకు గల అవకాశాలను టీచర్లు మంత్రికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ "సత్ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపునిస్తాం. స్వర్ణాంధ్ర సాధనలో విద్యాశాఖది కీలక పాత్ర.ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతో కాదు.. ఇతర దేశాలతో పోటీ పడాలి. అభ్యసన ఫలితాలు, ఎనలిటికల్ థింకింగ్‌పై దృష్టి సారించాలి. ప్రభుత్వోపాధ్యాయులను మించిన టీచర్లు ప్రైవేటు బడుల్లో లేరు. లక్షల మంది బిడ్డల భవిష్యత్తు మనపై ఆధారపడి ఉంది. విద్యారంగంలో ఏపీని మొదటి స్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేద్దాం. విదేశాల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా ఛేంజ్ మేకర్లు కావాలి. అక్కడ నేర్చుకున్నవాటిని సహ టీచర్లకు నేర్పాలి. మీకు అండగా మేముంటాం" అని మంత్రి లోకేశ్ తెలిపారు.

### జీవితకాల అభ్యసనకు ఉపయోగం

సింగపూర్‌లో కాంపిటెన్సీ బేస్డ్ ఎసెస్‌మెంట్ చాలా బాగుంది. అక్కడ ప్రాజెక్టులు, ప్రజెంటేషన్లు, ఎసైన్‌మెంట్లు, కంటెంట్ ఎలా తయారు చేస్తున్నారు.. అమలు చేస్తున్నారో అధ్యయనం చేశా. అక్కడి విద్యావిధానంతో విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్, సమస్య పరిష్కార సామర్థ్యం పెరుగుతాయి.

వై.యశోదలక్ష్మి, జిల్లా సమన్వయ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ, శ్రీకాకుళం

### పాఠశాల నిర్వహణ బాగుంది

సింగపూర్‌లో పాఠశాల నిర్వహణ విధానం బాగుంది. ప్రధానోపాధ్యాయులు, టీచర్లు ప్రతి వారాంతం సమావేశం ఏర్పాటు చేసుకుని, తదుపరి వారంలో బోధనాంశాలపై ప్రణాళికలు రూపొందించుకొని, అమలు చేస్తున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుదలకు అక్కడ 'హమాలా' పద్ధతి అమలు చేస్తున్నారు. ఈ విధానంలో హయ్యర్, మిడిల్, లోయర్ ఎచీవర్స్‌ను గుర్తిస్తారు. వెనుకబడిన వారికి ప్రత్యేకంగా బోధిస్తారు.

గుండేపల్లి ప్రభావతి, స్కూల్ అసిస్టెంట్, సఖినేటిపల్లి లంక, అంబేడ్కర్ కోనసీమ

### బోధన తక్కువ అభ్యసన అధికం

సింగపూర్‌లో బోధన తక్కువ(టీచ్ లెస్), అభ్యసన అధికం(లెర్న్ మోర్) విధానం బాగుంది. ఇందులో విద్యార్థులకు ఒక పీరియడ్ నిజ జీవిత అప్లికేషన్ కంటెంట్ తయారుచేస్తారు. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ అభివృద్ధి చెందడంతో పాటు సమన్వయం, సమస్యల పరిష్కార సామర్థ్యం పెరుగుతాయి.

విజయభారతి, హెచ్ఎం, నేలబొంతు, మెళియాపుట్టి మండలం, శ్రీకాకుళం

### 'మనమిత్ర'పై ప్రజలకు అవగాహన కల్పించాలి

మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. దీనికోసం నెల రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీజీఎస్‌పై మంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. 'ప్రభుత్వ శాఖల సమాచారాన్ని క్రోడీకరించేందుకు చేపట్టిన డేటాలేక్ పనులు జులై నాటికి పూర్తి కావాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో అడ్డంకులు తొలగించాలి. రేషన్ కార్డుల విభజన, కుటుంబ సభ్యుల పేర్లలో మార్పులు, చేర్పులను సులభతరం చేయాలి. సంజీవని కార్యక్రమాన్నీ డేటాలేక్‌తో అనుసంధానించాలి' అని లోకేశ్ సూచించారు.విద్యార్థులు, అభ్యర్థులకు విద్య, క్రీడా సంస్థలు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లన్నీ అభ్యర్థి ఆధార్ నంబర్ ఆధారంగా పరిశీలించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆ వివరాలు రియల్ టైమ్‌లో తెలిసేలా డిజీ వెరిఫైని పకడ్బందీగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను జలవనరులు, వ్యవసాయ, ఇతర శాఖలన్నీ సమన్వయంతో ఎదుర్కోవాలని లోకేశ్ సూచించారు.

## ఎవరెన్ని కుట్రలు చేసినా 'సర్' ప్రక్రియ ఆగదు: కిషన్‌రెడ్డి

పాతబస్తీలో బీఎల్‌వోలను మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. 'సర్'పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలకు పాల్పడినా సమగ్ర ఓటరు జాబితా సవరణను అడ్డుకోలేరని కిషన్‌రెడ్డి తేల్చి చెప్పారు.

## రౌడీయిజం చేసేందుకే వైకాపా నేతల అమరావతి పర్యటన: అనిత

వైకాపా నేతల పర్యటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం. పెనుమాకలో 90శాతం రైతులు రాజధానికి భూములిచ్చారు. వైకాపా నేతలు ఇచ్చిన ఫిర్యాదులపైనా విచారణ చేస్తాం" అని అనిత అన్నారు.ప్రజల కలల రాజధాని అమరావతి శరవేగంగా ముందుకెళ్తోందని అనిత అన్నారు. రాజధాని నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేయాలని అహర్నిశలు కష్టపడుతున్నామని తెలిపారు. "ఆనాడు మూడు రాజధానుల పేరుతో డ్రామా ఆడారు. ఇప్పుడు మావిగన్ అంటూనే రాజధానికి ఎలా వస్తారు? అమరావతి పూర్తయితే మనుగడ ఉండదనే వైకాపా డ్రామాలు ఆడుతోంది. వైకాపా అరాచకాలపై అమరావతి రైతులు ఆగ్రహంతో ఉన్నారు" అని తెలిపారు.

## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్.. రూబియో కీలక ప్రకటన

మరింత బలోపేతం అవుతున్నాయని చెప్పారు.ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి ట్రంప్ పర్యటన ఏర్పాట్లను ఖరారు చేసే అవకాశం ఉందని రూబియో వెల్లడించారు. వాషింగ్టన్‌లో ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్ అమెరికాకు అత్యంత సన్నిహిత భాగస్వామి, మిత్రదేశమని పేర్కొన్నారు. ట్రంప్ తన తొలి హయాంలో 2020 ఫిబ్రవరిలో భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే.ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా మోదీ, ట్రంప్ సమావేశమయ్యారని రూబియో గుర్తు చేశారు. ఇద్దరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధం దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కూడా తుది దశకు చేరుకుందని వెల్లడించారు. చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్నారు. ఒప్పందం పూర్తి కావడానికి ఇంకొన్ని అడుగుల దూరంలోనే ఉన్నామని తెలిపారు.క్వాడ్ దేశాల తదుపరి సమావేశం కోసం కూడా ఎదురుచూస్తున్నట్లు రూబియో తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ శక్తిగా ఎదిగిందని ప్రశంసించారు. ఇంధన రంగంలోనూ ఇరు దేశాల మధ్య సహకారం మరింత పెరుగుతోందన్నారు. భారీ క్రూడ్ ఆయిల్‌ను శుద్ధి చేసే సామర్థ్యం ఉన్న కీలక దేశాల్లో భారత్ ఒకటని పేర్కొన్నారు.

## నేడు పల్స్ పోలియో కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 27)

ఈ నెల 28 ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి ప్రకాశం భవన్ నుంచి పల్స్ పోలియో కార్యక్రమం పై అవగాహనా ర్యాలీ ని శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి టి వెంకటేశ్వర్లు జండా ఊపి ప్రారభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రసుత్తం జిల్లాలో 156477 మంది 0-5 సంవత్సరముల పిలల్లు ఉన్నారని, వారందరికి పోలియో చుక్కలు వేయించాలని ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమం జరిగే మొదటి రోజు అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఎవరు అయినను మొదటి రోజు పోలియో చుక్కలు వేసుకోని యడల రెండు, మూడవ రోజులలో గృహ సందర్శనముల యందు గుర్తించి పోలియో చుక్కలు వేస్తారన్నారు. జిల్లాలో ప్రసుత్తం 1062 పోలియో కేంద్రాలు, 34 ట్రాన్సిట్ పోలియో కేంద్రాలు, 69 మొబైల్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయుటకు మొత్తం 4,937 మంది వైద్యులు పారామెడికల్ సిబ్బంది, ఆషాలు, అంగన్వాడీ వర్కర్లు, వాలంటీర్లను నిమించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరిని కేంద్రాలకు తీసుకొని వచ్చి పోలియో చుక్కలు వేయించుకోవాల్సిందిగా కోరారు. ప్రకాశం జిల్లాలో సున్నా నుంచి ఐదు సంవత్సరాల పిల్లలు ఉన్న ఇటుక బట్టీలు, భవన నిర్మాణ కార్మికులు, వలస దారులు, దూర ప్రాంతాల్లో గాని తీర ప్రాంతాల్లో ఎక్కడ ఉన్నను వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆషాల ద్వారా పల్స్ పోలియో యొక్క ప్రాముఖ్యతను తెలియపరిచి వాళ్ళని 28వ తేదీ ఆదివారం కేంద్రాలకు వచ్చే విధంగా, మొబైల్ వాహనం ద్వారా వారికి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. జనసాంద్రత అధికంగా ఉన్న ఆర్టిసి బస్టాండ్, రైల్వే స్టేషన్, కూరగాయల మార్కెట్, ట్రాన్సిట్ బూతుల ద్వారా పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. 0-5 సంవత్సరముల లోపల పిల్లలు ఏ ఒక్కరు తప్పిపోకుండా అందరికి 100 శాతం పోలియో చుక్కలు వేయవలసిన భాద్యత మన అందరిపై ఉందని తెలిపారు. పోలియో బూత్ నిర్వహణలో ప్రభుత్వం సూచించిన నియమాల ప్రకారం పోలియో బూత్ నిర్వహించాలన్నారు. అదే విధంగా రైల్వేస్టేషన్, బస్టాండ్లు లో కూడా పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కమల శ్రీ తెలిపారు. ప్రతి రోజు పోలియో చుక్కలు వేసిన వివరములను సాయంత్రం 6 గంటల లోపల జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి వారి మెయిల్ ఐడికి పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ యమ్ రమేష్ బాబు, మాస్ మీడియా అధికారులు శ్రీనివాసులు, అప్పల రాజు, ఆఫీస్ సూపర్వైజర్లు జవహర్, రామాంజనేయులు, శ్రీదేవి, కోల్డ్ చెయిన్ సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవంగా పోశం వారి వివాహం మహోత్సవం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 27)

మార్కాపురం జిల్లా బిజెపి అధ్యక్షులు పోశం కృష్ణారావు కుమార్తె ఝాన్సీ లక్ష్మి, శశాంక్‌ల వివాహ మహోత్సవం మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాలులో శనివారం అత్యంత ఘనంగా కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి పొదిలి పట్టణం నుండి గాండ్ల తెలికుల సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి, పెద్ద సుబ్బారావు, బిజెపి రాష్ట్ర నాయకురాలు బెల్లంకొండ విజయలక్ష్మి, బెల్లంకొండ శ్రీనివాసులు,చిట్టెంశెట్టి శ్రీనివాసులు మునగాల కిరణ్ కుమార్, నూతక్కి నాగేశ్వరావు, దోర్నాల రమణారెడ్డి, మానవత సేవ సంస్థ ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్వీనర్ యల్లమందారెడ్డి, మువ్వల పార్థసారథి, రాష్ట్ర నలుమూలల నుండి బిజెపి, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు, పలు స్వచ్ఛంద సేవా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్స్ హాజరై వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.



ఈ వివాహ మహోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా భారతీయ జనతా పార్టీ ప్రధమ అధ్యక్షులు పోశం కృష్ణారావు మాట్లాడుతూ మా వివాహ మహోత్సవానికి వేలాదిమంది బంధుమిత్రులు హాజరై వధూవరులను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ప్రకాశంజిల్లా కన్వీనర్ గురునాథ్, నగర సహ కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, మార్కాపురం నగర కార్యదర్శి వెంకటయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగ చరణ్, తదితరులు పాల్గొన్నారు.











ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు  తెలుగు దినపత్రిక
28.06.26 ఆదివారం



**జిల్లాను అభివృద్ధిపథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తాం**
జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత
కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించిన సిఎం చంద్రబాబు
4



**ముఖ్యమంత్రి ఆశీస్సులు అందుకున్న యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి**
4

# వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం ఓ చరిత్ర

**నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలుగొండ**
**2027 నాటికి ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేస్తాం**
**గత పాలకుల నిర్లక్ష్యం వల్లే వెలుగొండ ఆలస్యం**
**మార్కాపురం హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం**
**నిర్వాసితుల ముఖాముఖిలో సిఎం చంద్రబాబు నాయుడు**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 27)

కరువు కాటకాలతో తల్లడిల్లి పోయే మార్కాపురం ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే ఆలోచన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రామారావు ఆలోచన చేశారని, ఆ మహనీయుడి ఆలోచన కార్యరూపం దాల్చి వెలుగొండ జలాలతో దశాబ్దాల కల సహకారం కానుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా పెద్ద దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు టన్నల్ వద్ద శనివారం ఉదయం జరిగిన నిర్వాసితుల ముఖాముఖిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారు. నాలుగు జిల్లాల తలరాతలు మార్చే వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం ఓ చరిత్రగా చంద్రబాబు అభివర్ణించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమైందని, 2027 నాటికి వెలుగొండ ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేసి నాలుగు జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెద్ద ఎత్తున వెలిగొండ పనులు చేపట్టామన్నారు. వైకాపా ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసామంటూ జాతికి అంకితం చేసి తీవ్ర మోసం చేసిందన్నారు. మోసం చేయడంలో గొడ్డలి పార్టీ దిట్టని అన్నారు. కళ్లార్పకుండా అబద్ధాలాడి తేరుకునేలోపే మోసం చేసేస్తారన్నారు. మోసాలు ఎలా చేస్తారో, ప్రజలను ఏ విధంగా ఏమారుస్తారోననే విషయం పై అవగాహన కల్పించేందుకు గొడ్డలి పార్టీ చర్యలను వివరిస్తూ మ్యూజియం పెట్టాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం కేవలం రూ.980 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6,736 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వాసితులకే ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ కింద ఇవ్వాల్సిన రూ.905 కోట్లకు గానూ తొలి విడతలో 2,357 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. సోమవారం వారి ఖాతాలో నిధులు జమ కానున్నాయన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులకు మరో రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చు చేయనున్నామన్నారు. నిర్వాసితులకు గత ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదని, కనీసం సొరంగాల్లో తవ్విన మట్టిని కూడా తీయకుండా, ఫీడర్ కెనాల్ పనులను పూర్తి చేయకుండా, ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ యంత్రాన్ని తీయకుండానే జాతికి అంకితం అని మోసం చేసిందన్నారు. 2014-19 మధ్య కాలంలోనే సొరంగాల పనులు చాలా వరకు పూర్తి చేశామన్నారు. వెలుగొండ ప్రాజెక్టు కోసం పూర్వీకుల నుంచి సంక్రమించిన పొలాలను, ఇళ్లను వదిలి వెళ్ళిపోతున్న నిర్వాసితుల త్యాగాలను మరువలేమన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో 7,225 మంది నిర్వాసితులు ఉన్నారని, ప్రతి ఒక్కరి వెనుకా ఓ విషాద గాథ ఉంటుందన్నారు. నిర్వాసితుల గోడు వెళ్లబోసుకోవాలని వస్తే కేసులు పెట్టి వైకాప ప్రభుత్వం వేధించిందని నిర్వాసితులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మాది ప్రజా ప్రభుత్వమని, ఏ ఒక్కరూ నష్టపోకుండా 2027 నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నాలుగు జిల్లాల ప్రజల తలరాతలు మార్చేస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో తెచ్చిన ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులు కోట్లాది రూపాయలు గడించారని, అభివృద్ధి చేస్తేనే ఆదాయం వస్తుందని, వెలిగొండ ప్రాజెక్టు వల్ల నాలుగు జిల్లాల పరిధిలో భూముల ధరలు పెరగనున్నాయన్నారు. గత ప్రభుత్వం పెట్టిన రూ.140 కోట్ల పెండింగ్ బిల్లులను కూడా చెల్లించామని, కరవు జిల్లా పరిస్థితులను అర్థం చేసుకునే అనంతపురం కు చెందిన కలెక్టర్ ఎం విజయ సునీతను మార్కాపురానికి నియమించామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. హార్టికల్చర్ పంటల ద్వారా రైతుల ఆదాయం మరింత పెరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పూర్వోదయ ప్రాజెక్టులో మార్కాపురం జిల్లాను కూడా చేర్చామని, అగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని, రామాయపట్నం పోర్టు కూడా మార్కాపురానికి సమీపంలో ఉండడం వల్ల ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా నిధులు జమ చేశామన్నారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీ పై పరికరాలు పంపిణీ చేస్తూ మరింత ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. హంద్రీ-నీవా ద్వారా కుప్పం చివరి భూముల వరకు నీళ్లిచ్చామని, పోలవరం ప్రాజెక్టులో డయా ఫ్రం వాల్ పడ గొట్టేలా చేసింది గత ప్రభుత్వమేనన్నారు. ప్రభుత్వాన్ని నమ్మి అమరావతికి రైతులు భూములిస్తే దాన్ని నిర్వీర్యం చేసి రాజధాని లేని రాష్ట్రంగా మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. అమరావతిని రాజధానిగా కేంద్రం చట్టం చేస్తే, మావిగన్ అనే కొత్త నాటకానికి తెరతీశారన్నారు. కులం, మతం, ప్రాంతం వంటి వాటి ప్రలోభాలకు గురి కావద్దు, మంచి, చెడు ఆలోచించి విశ్లేషించుకుని ఓట్లేయాలన్నారు. మార్కాపురం ప్రాంతానికి అన్నీ చేస్తున్నాం. పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామన్నారు. తుంగభద్ర డ్యాంకు గేట్లు పెట్టేందుకు సహకరించాం, సీజన్‌కు నీళ్లు ఇస్తున్నామన్నారు.



జల వివాదాలకు స్వస్తి పలకాలని నిర్ణయించామని, గంగా-కావేరి నదుల అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రం సస్యశ్యామలం కానుందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే గోదావరి, కృష్ణా, తుంగభద్ర, వంశధార, పెన్నా, కావేరి నదులు అనుసంధానం అయ్యేందుకు అవకాశం ఉందని, నదుల అనుసంధానంతో పాటు భూగర్భ జలాలు పెరిగేలా జలధార కార్యక్రమం చేపట్టామన్నారు. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ భారం తగ్గుతుందన్నారు. మార్కో ప్రాణి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, (తరువాయి 4లో...)



## ఉద్దేశపూర్వకంగా పొగాకును తిరస్కరిస్తే కంపెనీల లైసెన్సులు రద్దు చేస్తాం

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 27)

పొగాకు కొనుగోలు చేయకుండా కంపెనీలు ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తే (నో బిడ్) లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు హెచ్చరించారు. కొనుగోలు తీరు పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దగ్గర ప్రత్యేకంగా సమావేశం జరిగిన తర్వాత కూడా కంపెనీల ధోరణిలో మార్పు రాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పొగాకు బేలును కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. శనివారం ఆయన ఒంగోలు 1, ఒంగోలు 2 పొగాకు వేలం కేంద్రాలను తనిఖీ చేశారు. పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి విశ్వశ్రీతో కలిసి వేలం జరుగుతున్న (తరువాయి 5లో...)

## ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని
## టెక్నాలజీ వినియోగంలో నేను జెన్ జీ వర్గమే






నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష
కాలర్ ఎగరేసి చెప్పుకునేలా అమరావతి నిర్మాణం
నిర్మాణాల వేగం చూసి తట్టుకోలేకే రాజధానికి వైసీపీ నేతలు
ఛీ ఛీ అంటున్నా... మావిగన్ పట్టుకుని వేలాడుతున్నారు.
వైసీపీ క్రిమినల్ పాలిటిక్స్ తో సమాజానికి, ఆడబిడ్డలకు రక్షణ లేదు
కిష్టంశెట్టిపల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన
సీఎం చంద్రబాబు నాయుడు

(తరువాయి 4లో...)

## భావోద్వేగ భరిత వాతావరణంలో సాగిన రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం

రూ.300 కోట్ల విలువ గల చెక్కు నిర్వాసితులకు అందజేత



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జూన్ 27)

భావోద్వేగ భరిత వాతావరణంలో రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం సాగింది. రైతులు ఆనందంతో కన్నీటి పర్యంతమయ్యారు. 30 ఏళ్ళ తరువాత మాకు పునరావాస ప్యాకేజీ లభించిందని భావోద్వేగంతో ఆనంద భాష్పాలతో ముఖ్యమంత్రికి దండాలు పెట్టారు. (తరువాయి 5లో...)

# ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని

# టెక్నాలజీ వినియోగంలో నేను జెన్ జీ వర్గమే

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 27)**

రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టు అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులతో కూడిన సంజీవని ప్రాజెక్టును అమలు చేయనున్నట్టు వెల్లడించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టి పల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ కేర్ వరకూ వైద్య సేవలు అందేలా ఈ సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా వ్యక్తిగత ఆరోగ్య పర్యవేక్షణ ఉంటుందని సీఎం వివరించారు. ప్రజలు అందరికీ సంపూర్ణ వైద్య సేవలు అందించేలా సంజీవని కార్యక్రమం అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సూపర్ స్పెషాలిటీ వరకూ మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానిస్తామని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ..“ సంజీవని ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్ బుకింగ్, ఆరోగ్యంపై ఫాలోఅప్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్యసేవలు అందుతాయి. సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డ్స్ ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2.61 కోట్ల మందికి ఎన్సీడీ స్క్రీనింగ్ నిర్వహించాం. డి స్ట్రిక్ట్, స్టేట్, విలేజ్ డిసీజ్ ప్రొఫైల్ లను విశ్లేషిస్తాం. సంజీవని లాంటి కార్యక్రమాల అమలుకు ప్రజల నుంచి కూడా పూర్తి మద్దతు కావాలి. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామంతో ఆరోగ్యం కాపాడుకోవాలి. యోగా, ధ్యానం, ప్రాణాయామం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని కోరుతున్నాను. తాజా ఆహారం, రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటివి తీసుకోవాలి. ఆహారంలో కార్బొహైడ్రేట్స్ తగ్గించాలి. పేదల సంక్షేమంపై ఉన్న ఆలోచనతోనే పథకాలు అందిస్తున్నాం. స్త్రీశక్తితో ఉచిత ప్రయాణం, దీపం 2.0 లాంటి పథకాలు మహిళలకే అమలు చేస్తున్నాం. అన్నదాతకు అండగా ఉండేలా మొదటి విడత నిధులు విడుదల చేశాం. వచ్చే నెలలో తల్లికి వందనం పథకం కింద నిధులు తల్లుల ఖాతాలో జమ చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల పరపతి పెరిగింది. చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు వాడకుండా రైతుల కోసం ఓ యాప్ తీసుకువచ్చాం. మన దగ్గరి నుంచి ఎగుమతి చేసిన మిరపలో క్రిమి సంహారకాలు ఉన్నాయని చైనా వెనక్కు తిప్పి పంపింది. అందుకే ప్రకృతి సేద్యం చేసి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేద్దాం అని ముఖ్యమంత్రి అన్నారు.

### జెన్ జీ కంటే వేగంగా ఆలోచన

ప్రస్తుత జెన్ జీ, జెన్ ఆల్ఫా వర్గానికి చెందిన యువతలానే నేనూ జెన్ జీని భవిష్యత్తును ముందే ఊహించి దానికి అనుగుణంగా టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాను. ఏఐ, క్వాంటం టెక్నాలజీల్లో మన యువత నిష్ణాతులు కావాలి. చిన్న కుటుంబాలు భారత దేశ సంప్రదాయం కాదు, ఉమ్మడి కుటుంబమే ఆనందదాయకం అని గుర్తించాలి. జనాభా నిర్వహణ ఇప్పుడు తక్షణ అవసరంగా మారింది. ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఆలోచన చేస్తున్నాం. ప్రపంచంలోని కొన్ని దేశాలు జనాభా లేక ఇబ్బందులు పడుతున్నాయి. అమరావతి రాజధాని నగరాన్ని హరిత నగరంగా, నివాసయోగ్య ప్రాంతంగా నిర్మిస్తున్నాం. మన రాజధాని అమరావతి అని కాలర్ ఎగరేసి చెప్పేలా అభివృద్ధి చేస్తాం. గొడ్డలి పార్టీ ముందు అమరావతిని అంగీకరించి ఆ తర్వాత మూడు ముక్కల ఆట ఆడింది. ఐదేళ్ల పాటు తాత్సారం చేసిన గొడ్డలి పార్టీ అభివృద్ధిని ఆమడ దూరం పెట్టింది. గొడ్డలి పార్టీ నేతలు మోసాలు చేయటంలో దిట్టలు. అమరావతి చట్టం కూడా అయి పోయాక మావిగన్ అంటున్నారు. మావిగన్ అంటే ఎవరికీ అర్ధం కాదు. అందరూ ఛీ కొడుతున్నారు. బాధ్యతలేని రాజకీయ పార్టీ ప్రజల్ని వారి నిర్ణయాన్ని అపహాస్యం చేస్తోంది.“ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

### నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష

మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత కూడా నాకే వచ్చింది. రూ.3,900 కోట్ల పనులు చేయాల్సి ఉన్నా గత పాలకుడు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పునరావాసం కింద నేడు రైతులకు రూ.300 కోట్లు ఇచ్చాం. త్వరలోనే మరో రూ.600 కోట్లు విడుదల చేస్తాం. రెండు దశలలో 4 లక్షల ఎకరాల పైచిలుకు ప్రాంతంలో ఆయకట్టుకు నీరు అందుతుంది. రామాయపట్నం పోర్టు కూడా త్వరలోనే పూర్తై పరిశ్రమలు వస్తాయి ఇక్కడి యువతకు స్థానికంగానే ఉద్యోగాలు వచ్చేలా పారిశ్రామిక క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తున్నాం. ఉమ్మడి ప్రకాశం జిల్లా సహా రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేస్తాం. వివిధ రకాల పండ్ల తోటలతో పాటు వాణిజ్య పంటలు పండించేందుకు వీలుగా కార్యాచరణ చేపడతాం. తుంగభద్ర గేటు కొట్టుకు పోతే వెంటనే స్పందించి ఆ గేటు బిగించి 33 కొత్త క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేశాం. ఏపీ, తెలంగాణా, కర్ణాటక కలిసి రైతుల ప్రయోజనాల కోసం పని చేస్తున్నాం. గంగా– కావేరి నదుల అనుసంధానం జరిగేలా గోదావరి– నల్లమల సాగర్ లింక్ తో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం. గోదావరి నుంచి కావేరి నది వరకూ నీటిని తీసుకెళ్తాం. నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామ రక్ష. ఈ ప్రాజెక్టుల విషయంలో ఎవరికీ కడుపు ఉబ్బరం అవసరం లేదు. రైతు ప్రయోజనాలే ముఖ్యం కావాలి. ఎల్ నినో వల్ల వర్షాలు లేక నదుల్లో నీటి ప్రవాహాలు







తగ్గాయి. పర్యావరణం, నీటిని పొదుపుగా వాడుకోవాలి. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చటమే ఇప్పుడు మన తక్షణ కర్తవ్యం. చెక్ డ్యామ్ లు కడితే ఎగతాళి చేశారు. సాగునీరు ఇచ్చి రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు నడపాలన్నదే నా లక్ష్యం. జలధార ద్వారా భూగర్భజలాలు పెంచి అన్నమయ్య జిల్లా విజయం సాధించింది. ఇంత చేస్తుంటే కులం, మతం, ప్రాంతం అని కొందరు కుట్రలు చేస్తున్నారు. సమర్ధవంతమైన ప్రభుత్వమే ప్రజల సమస్యల్ని పరిష్కారం చేయగలుగుతుందని“ సీఎం స్పష్టం చేశారు.

### రాజధాని నిర్మాణం అడ్డుకోడానికే వైసీపీ కుతంత్రాలు

గత పాలనలో విధ్వంసంతో నలిగిపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులు, వ్యవస్థల విధ్వంసం, కనీసం నలుగురు వ్యక్తులు కలిసి మాట్లాడుకోలేని దుస్థితి గత పాలనలో ఉంది. నేడు మనం అంతా స్వేచ్ఛగా మాట్లాడు కోగలుగుతున్నాం. ఇదే నాటికి నేటికి ఉన్నతేడా. బ్లేడ్, గంజాయి బ్యాచ్ లు రాబందుల తరహాలో వేచి ఉన్నారు. ఏమీ జరక్కపోయినా ఏవో నేరాలు చేసి ఎవరో ఒకరిపై నెట్టేసి గొడ్డలి పార్టీ డైవర్ట్ చేస్తోంది. ఇటీవల విజయవాడలో జరిగిన ఓ ఘటనకు కులం రంగు పులిమి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై విమర్శలు చేశారు. హోం మంత్రి అనిత మేకప్ గురించి ఆమెను అవమానించేలా కొందరు వ్యక్తులు మాట్లాడుతున్నారు. మహిళల మేకప్ గురించి మాట్లాడటానికి ఆ పార్టీ వారికి సిగ్గు అనిపించటం లేదు. పోలీసుల పై ఇష్టాను సారంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇవన్నీ చూస్తూ ఊరుకోం. అమరావతి పై కుట్రచేయడానికే వైసీపీ నేతలు అక్కడికి వెళ్లారు. రాజధాని రైతుల్ని రెచ్చగొట్టడానికే అమరావతికి వెళ్లారు. రాజధాని నిర్మాణం జరుగుతుంటే దానిని అడ్డుకోడానికే వైసీపీ నేతలు రాజధాని ప్రాంతానికి వెళితే రైతులు వారిని అడ్డగించారు. గొడ్డలి పార్టీ నిరంతరం కుట్రలు చేస్తూనే ఉంది. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత దానికి లేదు. దేవాలయాల పై దాడులు చేసిన వ్యక్తులు ఇప్పుడు దేవాలయాల సందర్శనకు వెళ్లి నాటకాలు ఆడుతున్నారు. కళ్లార్పకుండా అబద్దాలు, మోసాలు చేస్తున్నారు. నేరాలు చేస్తారు, ఘోరాలు చేస్తారు. నేరస్థులైన రాజకీయ పార్టీలు, నేతలతో నేను పోరాడలేదు. ఆ పార్టీది పూర్తిగా క్రిమినల్ పాలిటిక్స్. గంజాయి బ్యాచ్, రౌడీ బ్యాచ్ ను తయారు చేసి అరాచకం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులతో ఆడబిడ్డలకు, సమాజానికి రక్షణ లేదు. వారు చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బాగు చేయడానికి సుదీర్ఘ సమయం పడుతోంది అని ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం మార్కాపురం జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలకు సంబంధించిన రిపోర్టు కార్డును సీఎం ప్రజల ముందు ఉంచారు. ప్రజామోదం లేని పాలనను సహించేది లేదని స్పష్టం చేశారు. పౌర సేవలను అందించే అంశం పై ఆకస్మిక తనిఖీలకూ వస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత, ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.












# వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం ఓ చరిత్ర

తెలుగుదేశం ప్రభుత్వానికి అండగా సహకారంగా ప్రజలు ఉండాలన్నారు. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తామని, ప్రజల ఆశీర్వాదం ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయులు, జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, 20 సూత్రాల పథకం అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఏలూరి డాక్టర్ రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పిటిసి కందుల రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# ముఖ్యమంత్రి ఆశీస్సులు అందుకున్న యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 27)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆయన కుమారుడు యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులు అందుకున్నారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెలుగొండ ప్రాజెక్టు ముంపు బాధితులకు రూ.300 కోట్ల రూపాయల చెక్కులు అందజేసే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా దోర్నాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి గులాబి పువ్వును అందజేసి తండ్రి, కొడుకులు ఇరువురు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు విగ్నేష్‌రెడ్డి తో ముచ్చటించారు. అనంతరం విగ్నేష్‌రెడ్డికి భవిష్యత్ బాగుంటుందని ఆశీస్సులు అందజేశారు.

# జిల్లాను అభివృద్ధిపథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తాం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 27)**

కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు అధికారుల సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లి సంజీవిని డిజిటల్ నర్వ్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జలధార –జల హారతి కార్యక్రమంలో మార్కాపురం జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలపడంలో ప్రత్యేక కృషిచేసిన కలెక్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

## ఎమ్మెల్యే కందుల ఆదేశాలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 27)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పొదిలి పడమటిపాలెంలో లోవోల్టేజ్ ఉంది అని అర్జీ పెట్టిన వెంటనే ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సంబధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలతో శనివారం నూతన ట్రాన్ఫరమ్, నూతన సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన కరెంట్ సరఫరా చేయడం జరిగిందని స్థానిక టీడీపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి లైన్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి, జూనియర్ లైన్ మెన్ సుభాని, ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టీడీపీ బూత్ కన్వీనర్లు షేక్ బుజ్జి (ఖాదర్ బాషా), అంకిత మోహన్‌రావు, కాలేషా, కాంట్రాక్టర్ కంచర్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన

రూ.10 లక్షలతో భోజనశాల ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 27)

పొదిలి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని 1980 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం 1980 పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించనున్న భోజనశాలకు మార్కాపురం డిప్యూటీ డీఈవో ఎం శ్రీనివాసులు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షేక్ కరిమున్ బి, బీవీ రెడ్డి, ఉపాధ్యాయులు, 1980 10వ తరగతి పూర్వ విద్యార్థులు పీవీఎల్ ఎన్‌వి బాల సూర్యనారాయణ, ముల్లా షరీఫ్, షేక్ జిలాని భాష, షేక్ జాఫర్ జిలాని, అబ్బు రామయ్య, పాతూరి సత్యం, టి శ్రీనివాస్, షేక్ వహీద్, జి కామయ్య, గిరి, ఎం ఖాదర్ వలి, వి పద్మ, రోజా రాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కొండయ్యను అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, చీరాల, జూన్ 27)

చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య శనివారం గిద్దలూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీ కార్యక్రమాలు, విస్తృతస్థాయి స్థాయి సమావేశాల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అద్భుత తీరును ప్రదర్శిస్తూ, అహర్నిశలు కృషి చేస్తున్నావని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే కొండయ్యను కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని చంద్రబాబు నాయుడు సూచించారు.

# ఉద్దేశపూర్వకంగా పొగాకును తిరస్కరిస్తే కంపెనీల లైసెన్సులు రద్దు చేస్తాం





కొనుగోలు చేసే పొగాకు రకం గురించి రైతులకు ముందుగానే తెలియజేయాలని కంపెనీలను ఆదేశించారు. అలా కాకుండా తీరా తీసుకువచ్చిన తర్వాత ' నో బిడ్ ' అంటే రైతులు రవాణా, ఇతర ఖర్చుల రూపంలో నష్టపోతారని ఆయన అన్నారు. రైతులను, కంపెనీలను సమన్వయం చేసేందుకే పొగాకు బోర్డు, ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు.

తీరును పరిశీలించారు. రైతులతోనూ, కొనుగోలుదారులతోనూ ఈ సందర్భంగా ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు కంపెనీలు ఇష్టానుసారంగా తిరస్కరిస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఇక్కడ 140 మిలియన్ టన్నుల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇస్తే, రైతులు 230 మిలియన్ టన్నుల వరకూ పండించినట్లు చెప్పారు. అధిక ఉత్పత్తిని సాకుగా చూపి కొనుగోలు చేయకంటే సహించబోమని కంపెనీలకు తేల్చి చెప్పారు. రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వము, బోర్డు ముందుకు వచ్చిందని, కంపెనీలు కూడా తమ వంతు బాధ్యత నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. పొగాకు కొనుగోలు కోసం ఇప్పుడు ముందుకు వచ్చే కంపెనీలకే వచ్చే ఏడాది కూడా వేలంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. వచ్చే ఏడాది కేవలం 80 మిలియన్ టన్నుల ఉత్పత్తి వరకే అనుమతి ఉంటుందని, అంతకు మించి పండించవద్దని రైతులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పుడు అధిక డిమాండ్ కారణంగా తాము కొనుగోలు చేస్తామంటూ వచ్చే కంపెనీలను అనుమతించబోమని కలెక్టర్ తేల్చి చెప్పారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని కంపెనీలు ఉదారంగా ముందుకు వచ్చి పొగాకు కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. కంపెనీల తరఫున ప్రతినిధులుగా పాల్గొంటున్న వారు ఈ విషయాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని కలెక్టర్ చెప్పారు. అలాకాకుండా దురుద్దేశపూర్వకంగా కొనుగోలును తిరస్కరిస్తే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. సోమవారం నుంచి వేలం కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను పరిశీలించేందుకు వ్యవసాయ శాఖ తరపున అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారిని పెడతామన్నారు. వేలం కేంద్రానికి వచ్చిన ప్రతి పొగాకు బేలును తిరస్కరించకుండా కొనుగోలు చేయాల్సిందేనని కలెక్టర్ తేల్చి చెప్పారు. ఇష్టానుసారంగా ధరల కోత, నో బిడ్ అంటే కుదరదని స్పష్టం చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారి ఈ విషయాలన్నిటినీ పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కూడా ఒకరకమే కాకుండా వివిధ గ్రేడ్ల పొగాకులను పూర్తిస్థాయిలో వేలం కేంద్రానికి తీసుకురావాలని ఆయన చెప్పారు. మొత్తంగా చూస్తే సగటున కిలోకు రూ.200 తగ్గకుండా చూడాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలను వేలం కేంద్రాల్లో అమలయ్యేలా చూస్తామని రైతులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ వేలం ప్రక్రియలో పాల్గొంటామని రిజిస్ట్రేషన్ చేసుకున్న కంపెనీలన్నీ కచ్చితంగా హాజరు కావాల్సిందే అన్నారు. హాజరుకాని కంపెనీలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే వారం నుంచి కొనుగోలులో పాల్గొనకపోతే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ సంవత్సరం ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో రైతుల నుంచి కొనుగోలు చేయాలని కంపెనీలకు చెప్పారు. ఈ సందర్భంగా వారి వెంట పొగాకు బోర్డు ఆర్.ఎం. ప్రసాద్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు వరలక్ష్మి, ఇతర అధికారులు, వేలం మేనేజర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తా. జిల్లాలో పొగాకు విక్రయ ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు రైతు సంఘం నాయకులు ప్రకాశం భవనంలో కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. వాటి పరిష్కారానికి జిల్లాస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని, ఉన్నత స్థాయి నిర్ణయాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నివేదిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## భావోద్వేగ భరిత వాతావరణంలో సాగిన రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం







యర్రగొండ









నియోజకవర్గం, గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు భూములివ్వడం అంటే త్యాగం చేసినట్టే. పూర్వీకుల నుంచి వచ్చిన భూములను ప్రాజెక్టు కోసం వదులుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగు జిల్లాల తలరాతను మారుస్తుంది. ఈ ప్రాంత నీళ్లల్లో ఫ్లోరైడ్ సమస్యలు ఉన్నాయి. దీంతో ఇక్కడి స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్కాపురం ప్రాంతం అంటే కరవు ప్రాంతమని పేరు. ఈ ప్రాంతానికి కృష్ణా నీళ్లు వస్తాయని ఎవ్వరూ అనుకోలేదు. మార్కాపురం ప్రాంతానికి కృష్ణా నీళ్లిచ్చేందుకు ఎన్టీఆర్ 1985 లోనే ఆలోచన చేశారు. దీని కోసం ఓ కమిటీని వేశారు. ఎన్టీఆర్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 1995లో ప్రకాశం జిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా వెలిగొండ ప్రాజెక్టు గురించే అడిగేవారు. వరద వస్తే ఆ జలాలను మళ్లిస్తే ఆ నీళ్లతో తాము జీవనం సాగిస్తామని ఇక్కడి రైతులు చెప్పేవారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేశాం. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.10,580 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు రూ. 6,736 కోట్లు ఖర్చు చేశాం. ఇంకా రూ.3,844 కోట్లు ఖర్చు పెట్టాలి. రూ.1932 కోట్లు తొలి విడతలో ఖర్చు పెట్టాలి. రూ. 1906 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంది. 2024లో ప్రభుత్వం వచ్చాక రూ.759 కోట్లు ఖర్చు చేశాం. నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేసి రూ.300 కోట్లు విడుదల చేస్తున్నాం. రెండు రోజుల్లో నిర్వాసితుల ఖాతాల్లో ఆర్ అండ్ ఆర్ డబ్బులు జమ అవుతాయి. గత పాలకుల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్రం విధ్వంసమైంది. శాంతి భద్రతలకు తీవ్రమైన విఘాతం కలిగించేలా వ్యవస్థలను నిర్వర్యం చేశారు. పరిశ్రమలను తరిమేశారు. పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారు. అప్పుల భారాన్ని పెంచారు. మంత్రి నిమ్మల వెలిగొండ ప్రాజెక్టు వద్దే ఉంటారు. టన్నెల్లోకి వెళ్తున్నారు. పుట్టిన రోజు కూడా ఇక్కడే జరుపుకున్నారు. వచ్చే ఏడాది నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన రైతులు, నిర్వాసితుల జీవితాలు మెరుగ్గా ఉంటాయి. ఇవాళ 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు జమ చేస్తున్నాం. కలనూతల, సుంకేసుల, చింతలముడిపి, బుడుంచెర్ల, కాటంరాజు తండా, సాయిరాం నగర్, మెట్టి గొంది, బసవాయిపల్లి, లక్ష్మీపురం, అక్కచెరువు, గొట్టిపడియ గ్రామాల నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ నిధులు ఇస్తున్నాం. కలెక్టరేట్ పక్కన కొన్ని గ్రామాలకు నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్నాం. కొత్త జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు నిర్వాసితుల కాలనీలో కలెక్టరేట్ ఏర్పాటు చేస్తున్నాం. నిర్వాసితుల కాలనీల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేశాం. నిర్వాసితుల త్యాగం వల్ల 4.47 లక్షల ఎకరాలకు నీళ్ళు అందుతాయి. 23 లక్షల మందికి తాగునీరు లభిస్తాయి. జులై 31 నాటికి వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్1 నీళ్లను త్వరితగతిన ఇస్తాం. ఫేజ్1 కింద 1.19 లక్షల ఎకరాలకు నీళ్లు, 4 లక్షల మందికి తాగునీరు అందిస్తాం. ఫేజ్ 2 కింద 3.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.





## పేకాట రాయుళ్ల అరెస్ట్



(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 27)
శుక్రవారం రాత్రి సుమారు 12.45 గంటలల సమయంలో పామూరు పట్టణంలోని శ్రీనివాస లాడ్జిలో ఏడుగురు పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్ల మీద పామూరు మండల ఎస్ఐ అనుక్ పోలీస్ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.18,500లు నగదు సీజ్ చేసారు. పేకాట ఆడుతున్న వారి పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ అనూక్ తెలిపారు.

## రామారావు కుటుంబాన్ని పరామర్శించిన దళిత హక్కుల పోరాట సమితి

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 27)
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కనిగిరి మండల కార్యదర్శి గోర్రుముచ్చు పెద్ద రామారావు బుధవారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు శనివారం వారి స్వగృహం అయిన కనిగిరి మండలం ఏరువారిపల్లెలో ఆయన సతీమణి, కుటుంబ సభ్యులను మార్కాపురం జిల్లా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్‌తో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలన్నారు. రామారావు చనిపోవడం కనిగిరి ప్రాంతంలోని సిపిఐ కుటుంబానికి తీరనిలోటన్నారు. ఈ ప్రాంతంలో ఉద్యమంలో నిబద్దత, నిజాయితీగా పనిచేసే రామారావు అంటే కమ్యూనిస్టు పార్టీ అన్న స్థాయిలో పని చేశారన్నారు. అంత గుర్తింపు తెచ్చుకున్న నాయకుడిగా ఆయన స్థానాన్ని పదిలపరుచుకున్నారని అన్నారు. అనంతరం వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, నారాయణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## పోరుమామిళ్లలో వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్న కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు

### వల్లం కొండు వెంకటరమణ, కమిటీ సభ్యులు జిల్లా సంఘం ఉపాధ్యక్షులుగా విశ్వనాదుల ప్రసాద్



(షణ్ముఖ వెలుగు, పోరుమామిళ్ళ, జూన్ 27)
కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లం కొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, పలువురు కమిటీ సభ్యులు శనివారం సాయంత్రం బద్వేల్ పోరుమామిళ్లలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి పోరుమామిళ్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విశ్వనాధల ప్రసాద్, సెక్రటరీ మాలేపాటి నారాయణ, కోశాధికారి మిట్ట సుధాకర్, మాజీ ఆర్యవైశ్య అధ్యక్షులు పెసల నరసిహులు, ఆర్య వైశ్య జిల్లా ఉద్యోగ సంఘం చైర్మన్ సాదు వెంకటేశ్వర్లు, పలువురు సాదరంగా ఆహ్వానం పలికి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువా, పూలమాలలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు పోరుమామిళ్ల అమ్మవారిశాల అధ్యక్షులు విశ్వనాధుల ప్రసాదును, జిల్లా సంఘం ఉపాధ్యక్షులుగా నియమిస్తూ శాలువాతో సత్కరించి వారి పేరును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పబ్బతి సత్యనారాయణ, పైడిమర్రి సురేష్ బాబు, అనిల్, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బ్రహ్మంగారిమఠం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని దర్శించిన కడప జిల్లా (రూరల్) ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్

## జిల్లా రూరల్ ఉపాధ్యక్షుడిగా అయ్యప్ప వెంకట సురేష్ బాబు నియామకం

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జూన్ 27)
కడప జిల్లా బ్రహ్మం గారి మఠం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని శనివారం కడప జిల్లా (రూరల్) ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, ఇతర ప్రముఖులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన జిల్లా వైశ్య నాయకులకు, బద్వేల్ ఆర్యవైశ్య ప్రముఖులు పబ్బతి సత్యనారాయణ, పెండ్లిమర్రి సురేష్ బాబు, వల్లంకొండు అనిత్‌లతో కూడిన బృందానికి ఆలయ మర్యాదలతో స్థానిక ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యప్ప వెంకట సురేష్ బాబు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం, నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణను, గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్‌ను స్థానిక కమిటీ ప్రెసిడెంట్ అయ్యప్ప వెంకట సురేష్ బాబు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ కీలక ప్రకటన చేశారు.



బ్రహ్మంగారిమఠం ఆర్యవైశ్య సభ అధ్యక్షులుగా సేవలు అందిస్తున్న అయ్యప్ప వెంకట సురేష్ బాబును కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ ఉపాధ్యక్షుడిగా ప్రకటిస్తూ, ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వల్లంకొండు వెంకటరమణ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలోని ఆర్యవైశ్యులందరినీ ఏకతాటిపైకి తెచ్చి, త్వరలోనే బలిష్టమైన మండల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. వైశ్యుల సంక్షేమానికి, ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అదే విధంగా బ్రహ్మంగారిమఠం అమ్మవారి శాల (ఆలయం) అభివృద్ధి గురించి, ఇక్కడ స్థానికంగా వైశ్య సామాజికవర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి జిల్లా కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ఉత్సాహభరిత కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు ముచ్చర్ల శేషయ్య, మునగనూరి వెంకటేశ్వర్లు, సుంకు నాగేశ్వరరావు, సెక్రెటరీ సుంకు సురేష్ బాబు, కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, ఉప కోశాధికారి పబ్బతి నాగేశ్వరరావు పాల్గొన్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులు ముచ్చర్ల సత్యనారాయణ, పత్తి సురేష్, గౌరవ అధ్యక్షులు సుంకు పెద్ద సిద్దయ్య, పెద్ద సంఖ్యలో స్థానిక ఆర్యవైశ్య బంధువులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.





## పల్స్ పోలియో పై అవగాహన ర్యాలీ




(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 27)
చిన్నగంజాం పోలియో రహిత సమాజం మనందరి లక్ష్యమని సంతరావురు వైద్యులు డాక్టర్ కె కీర్తి సారోజ్, బి నాగేంద్ర అన్నారు. శనివారం మండలంలోని సంతారావురు గ్రామం నందు వైద్యులు డాక్టర్ కె కీర్తి సారోజ్, బి నాగేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కీర్తి సరోజ్, నాగేంద్ర మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల బాలబాలికలు తప్పని సరిగా పోలియో రెండు చుక్కలు వేయించుకొని అంగవైకల్యం ను తరిమి కొట్టాలన్నారు. పోలియో కేంద్రంనకు వచ్చేటప్పుడు బిడ్డ ఆధార్ కార్డు లేకపోతే తల్లి ఆధార్ కార్డు తీసుకొని రావాలని తెలియాజేసారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనందం, హెల్త్ సూపర్వైజర్ వి వెంకటరమణ, శ్రీధర్, ఏఎన్ఎం ఎ శాంతకుమారి, ఆశాలు, అంగన్వాడీ పాల్గొన్నారు.

## శివుడి లీలలు అపారమైనవి

### ప్రకాశం జిల్లా రతయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 27)




శివుడి లీలలు అపారమైనవని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్లోని శ్రీ గంగా పార్వతీ సమేత రాజరాజేశ్వర స్వామి వారికి జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివ లీలామృతం అన్న అంశంపై పొన్నూరు వేంకట శ్రీనివాసులు ప్రసంగించారు. శివుడు లింగ రూపంగా అవతరించటం, తలపై గంగను ఉంచుకోవడం, గరళంలో విషాన్ని దాచుకోవడం, అర్ధనారీశ్వర తత్వం, మెడలో పాములు ధరించటం, స్మశానంలో నివాసం ఉండటం లాంటి అనేకమైన లీలలను ప్రదర్శించారని అన్నారు. శివుడు తీర్చలేనటువంటి కోరిక లేదని శివుడి కరుణాకటాక్షాలు ఉంటే అసాధ్యమైనటువంటి పనులు కూడా సుసాధ్యమవుతాయని అన్నారు. విభూది ధారణ వల్ల కలిగే ప్రయోజనాలను, ఫలితాలను కూలంకషంగా వివరించారు. శివుడికి చేసే అభిషేకం, శివుడికి సమర్పించే విభూతి, శివుడికి అర్పించే మారేడు దళం చిరస్మరణీయమైన ఫలితాలు ఇస్తాయని అన్నారు. శివారాధనతో ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి వెళ్లి మోక్షం పొందిన 63 మంది నాయనార్ల జీవిత గాధలు శివ భక్తికి నిదర్శనమని వివరించారు. స్వామివారికి నిర్వహించిన బృంగి వాహన సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులను దేవస్థానం కార్యనిర్వహణాధికారి బోడపాటి శ్రీనివాసరావు, అర్చక స్వామి ఆమంచి వేంకట శివ మణికంఠ శర్మ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, వేద ఆశీర్వచనం అందజేశారు.



## గుంటూ దానమయ్య (చిరంజీవి)కి నివాళులర్పించిన ఎమ్మెల్యే తాటిపర్తి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 27)
మండలంలోని మద్దలకట్ట గ్రామంలో విషాదం నెలకొంది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న మృతి చెందిన మద్దలకట్ట మాజీ సర్పంచ్ భర్త గుంటూ దానమయ్య (చిరంజీవి) చిత్రపటానికి ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం, దానమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును సందర్శించిన కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 27)
జిల్లా కలెక్టర్ పి రాజాబాబు శనివారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి స్థానిక భాగ్యనగర్ లో ఉన్న ఈవీఎం గోదామును సందర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘ నిబంధనల ప్రకారం త్రైమాసిక పరిశీలనలో భాగంగా గోదాము తలుపులు తెరిచి, అందులో భద్రపరచిన వీవీ ప్యాట్లు, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లను పరిశీలించారు. వాటి పరిస్థితిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాధురి, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, జిల్లా ఎలక్షన్ సెల్ సూపరంటెండెడ్ శ్రీనివాసరావు, తహసిల్దార్ కృష్ణమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రాంతికుమార్ (వైసిపి), కసుకుర్తి అంకరాజు (టిడిపి), గుర్రం సత్యనారాయణ (బిజెపి), షేక్ రసూల్ (కాంగ్రెస్), గంజి గోపిరాజు (బిఎస్పీ), తదితరులు పాల్గొన్నారు.

## పోలియో పై అవగాహన ర్యాలీ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 27)

ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని నినాదాలు చేస్తూ స్థానిక ప్రాథమిక వైద్యశాల నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య అధికారి రవి కిరణ్ మాట్లాడుతూ అంగవైకల్యం కలగకుండా ముందు జాగ్రత్తగా తల్లిదండ్రులు తమ పిల్లలకు రెండు పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని తెలిపారు. 28, 29, 30 తేదీలలో గ్రామంలోని పల్స్ పోలియో బూతుల్లో పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు మల్లికార్జునరావు, సునీల్‌రెడ్డి, సిహెచ్‌ఓ భాస్కరరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆటోలకు గుర్తింపు నంబర్లు భద్రతకు వెదుళ్ళపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు వినూత్న చర్య





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 27)

వెదుళ్ళపల్లి ఆటో స్టాండ్‌లోని ఆటోలకు గుర్తింపు సీరియల్ నంబర్లు, డ్రైవర్ల వివరాలతో కూడిన ప్రొఫైల్ బోర్డులను వెదుళ్ళపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు శనివారం పంపిణీ చేశారు. జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వరరావు ఆదేశాలు, డీఎస్పీ చంద్రమౌళి సూచనలు, సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రతి ఆటోపై సీరియల్ నంబర్‌తో పాటు డ్రైవర్ ఫోటో, పేరు, ఫోన్ నంబర్, పోలీసు వెరిఫికేషన్ వివరాలను ప్రదర్శించే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లల్లో భద్రతపై విశ్వాసం పెరుగుతుందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే ప్రయాణికులు మరిచిపోయిన వస్తువులను గుర్తించి తిరిగి అందించడం సులభమవుతుందని, అనధికార వ్యక్తులు ఆటోలు నడపకుండా అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. ఈ వినూత్న కార్యక్రమంపై స్థానికులు, ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు.

## బీఎంఎస్ అభ్యాస వర్గం ప్రారంభం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 27)

భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఎంఎస్ అభ్యాస వర్గం శనివారం ఒంగోలులో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ సంస్థాగత కార్యదర్శి బి సురేంద్రన్, జాతీయ ఉపాధ్యక్షులు పవన్, దక్షిణ భారత సంస్థాగత కార్యదర్శి వి రాధాకృష్ణన్, ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వారు భారతీయ కార్మిక ఉద్యమ చరిత్ర, బీఎంఎస్ సిద్ధాంతాలు, కార్మికుల హక్కుల పరిరక్షణలో సంఘం పోషిస్తున్న పాత్ర, దేశాభివృద్ధిలో కార్మికుల బాధ్యతలపై విస్తృతంగా వివరించారు. అభ్యాస వర్గం ద్వారా కార్యకర్తలకు సంస్థాగత నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, కార్మిక చట్టాల పై అవగాహన, జాతీయ పునర్నిర్మాణంలో కార్మికుల పాత్ర వంటి అంశాల పై శిక్షణ అందించబడుతుందని తెలిపారు. ఈ అభ్యాస వర్గం రాబోయే రోజుల్లో వివిధ అంశాల పై సుదీర్ఘ చర్చలు, శిక్షణా కార్యక్రమాలతో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగా సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 27)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలోని గిద్దలూరు మండలం క్రిష్ణంశెట్టిపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సంజీవని డిజిటల్ నర్వ్ సెంటర్‌ను ప్రారంభించి, అనంతరం నిర్వహించిన బహిరంగ సభ, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ముఖ్యమంత్రి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. పర్యటనకు ముందుగా హెలిప్యాడ్ ప్రాంగణం, వీఐపీ రూట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సంజీవని డిజిటల్






నర్వ్ సెంటర్, ప్రజావేదిక, పార్కింగ్ ప్రాంతాలను జిల్లా ఎస్పీ పరిశీలించి భద్రతా చర్యలను సమీక్షించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావేదిక, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో ముందస్తు తనిఖీలు నిర్వహించారు. వీఐపీ రాకపోకల కోసం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ప్రజల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధంగా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తు ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయడం ద్వారా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

ముఖ్యమంత్రి సంజీవని డిజిటల్ నర్వ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ప్రజావేదికలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొని, అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి పర్యటనను ముగించుకుని బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళికతో పాటు వివిధ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం కారణంగా ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తైందని తెలిపారు. బందోబస్తు నిర్వహణలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది, ట్రాఫిక్ విభాగం, ప్రత్యేక బలగాలు, అలాగే సహకరించిన ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను అభినందించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలందరికీ జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో 50% ఫీజు రాయితీ ఇవ్వాలి

### జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకను కలిసి వినతి పత్రం అందజేసిన చిన్న, మధ్య తరగతి న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సభ్యులు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 27)



ప్రకాశం జిల్లాలో స్థానిక చిన్న, మధ్య తరగతి జర్నలిస్టుల అసోసియేషన్ సభ్యులు జర్నలిస్టుల పిల్లలకు 2026 -2027 విద్యాభ్యాసానికి సంబంధించి 50% రాయితీ ఇవ్వాలని, విద్యార్థులకు మంచి విద్యాభ్యాసం అందించేలా చర్యలు విద్యాశాఖ తీసుకోవాలని శనివారం జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ షేక్ కాలేషావలి మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టులు మధ్యతరగతి జీవితం గడుపుతున్నారని, వారి పిల్లలకు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారిణి చొరవ చూపి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ గతంలో ఇచ్చినట్లుగానే ఈ సంవత్సరం కూడా ఇవ్వాలని కోరారు. అదే విధంగా మీడియా రంగంలో ఉన్నవారికి త్వరగా రాయితీ అందించేందుకు కలెక్టర్‌తో మాట్లాడతానని జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుక తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న, మధ్యతరగతి పత్రికల అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రకాశం జిల్లా కన్వీనర్ షేక్ కాలేషా వలి, సభ్యులు వి శివరాం, టి శైలజ, సతీష్, సిహెచ్ ఆనంద్ బాబు, ఉబ్బా అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణికి వినతి పత్రం అందించిన యుటిఎఫ్ నేతలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 27)



యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల మీద, సర్దుబాటును జీవో నెంబర్ 21, 33 ప్రకారం జరపాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉలవపాడు మండలంలోని చాకిచెర్ల మెయిన్, ప్రాథమిక పాఠశాల, వాక ప్రాథమిక పాఠశాలలో జీరో ఎన్రోల్మెంట్ ఉన్న ఉపాధ్యాయులను కౌన్సిలింగ్లో అవకాశం కల్పించాలని, యూపీ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లను అదే పాఠశాలలో కొనసాగించాలని, కందుకూరు జడ్పీ హైస్కూల్ నందు ఉర్దూ మీడియా, ఇంగ్లీష్ మీడియం సెక్షన్లను వేరుగా చూపించి నాంస్ ప్రకారం వారికి స్కూల్ అసిస్టెంట్ తెలుగు పోస్టులను కేటాయించాలని ఆమెకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై, జిల్లా కోశాధికారి ఎన్ చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి ఏ గోపాల్‌రెడ్డి, జిల్లా సిపిఎస్ కన్వీనర్ ఆర్ నారాయణ, ఉపాధ్యాయుడు ఆర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 27)

జిల్లాలో 28న ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రవిబాబు పిలుపునిచ్చారు. శనివారం తన కార్యాలయంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు 2,37,527 మంది చిన్నారులు పోలియో చుక్కలకు అర్హులుగా గుర్తించామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర హైరిస్క్ ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనే వైద్యాధికారులు, సూపర్వైజర్లు, వ్యాక్సినేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, అవసరమైన పోలియో వ్యాక్సిన్, బ్యానర్లు, ఇతర సామగ్రిని అన్ని ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేశామని వెల్లడించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచే పోలియో చుక్కల పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు వేసిన వివరాలను ఆధార్ లేదా ఏబీహెచ్‌ఏ ఐడీ ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లల ఆధార్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే పోలియో చుక్కలు వేసిన పిల్లలకు కూడా మళ్లీ చుక్కలు వేయించడం తప్పనిసరి అని తెలిపారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. "పోలియో నుంచి శాశ్వత రక్షణకు రెండు పోలియో చుక్కలే మార్గం" అని పేర్కొంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీపీఎంఓ మహమ్మద్ తహర్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ ఆరెపుల్లా, డీఈఎంఓ భారతి, ఎస్‌వో రమేష్‌రెడ్డి, సీహెచ్‌వో మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ చాపల వంశీ కృష్ణకి "ఇన్ స్పైరింగ్ ఆర్థోపెడిక్ సర్జన్ ఆఫ్ ఇండియా" అవార్డు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 27)




ఆర్మీ మెడికల్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ మురళీధరన్ చేతుల మీదగా అవార్డు అందుకున్న డాక్టర్ చాపల వంశీ కృష్ణ

ప్రముఖ వార్తా సంస్థ "టైమ్స్ నౌ" దేశవ్యాప్తంగా వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వైద్యులను సత్కరించే క్రమంలో డాక్టర్ చాపల వంశీ కృష్ణ ని "ఇన్‌స్పైరింగ్ ఆర్థోపెడిక్ సర్జన్ ఆఫ్ ఇండియా" అవార్డుకు ఎంపిక చేసింది. శనివారం సాయంత్రం ఢిల్లీ లోని తాజ్ ప్యాలస్ హోటల్‌లో "భారత గుండెచప్పుడు పది లక్షల వైద్యులు, వంద కోట్ల జీవితాల రక్షణ" అనే నినాదంతో నిర్వహించిన "టైమ్స్ నౌ డాక్టర్స్ డే కాంక్లేవ్ - 2026" జాతీయ సదస్సులో డాక్టర్ చాపల వంశీ కృష్ణ సేవలను కొనియాడుతూ "ఇన్ స్పైరింగ్ ఆర్థోపెడిక్ సర్జన్ ఆఫ్ ఇండియా" అవార్డును ఇండియన్ ఆర్మీ మెడికల్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ మురళీధరన్ ప్రధానం చేయడం జరిగింది. వైద్య రంగంలో పేద ప్రజల కోసం అందిస్తున్న నాణ్యమైన సేవలు, ఉచిత వైద్య శిబిరాలు, రోగుల పట్ల అంకితభావం, ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలో సాధించిన విశిష్ట విజయాలకు గుర్తింపుగా "పేదల డాక్టర్" మంచి హస్తవాసి కల డాక్టర్ గా పేరు పొందిన డాక్టర్ చాపల వంశీ కృష్ణ కి ఈ గౌరవం లభించింది. ఇందులో అనేక మంది జాతీయ స్థాయి ప్రముఖులు పాల్గొని వైద్యులనుద్దేశించి ప్రసంగించారు. హర్యానా గవర్నర్ ప్రొఫెసర్ ఆషిమ్ కుమార్ ఘోష్, ఛత్తీస్‌ఘడ్ గవర్నర్ రామెన్ డేకా , కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూగర్భ శాఖ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్, సుప్రీమ్ కోర్టు మాజీ న్యాయమూర్తి, ప్రస్తుత అంతర్జాతీయ న్యాయ మూర్తి జస్టిస్ అర్జన్ కుమార్ సిక్రి, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ సేథ్, సర్ గంగారామ్ హాస్పిటల్ ప్రిన్సిపల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ వాలి, నేషనల్ హెల్త్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్, బర్న్ వాల్ ఐఏఎస్, నేవీ మెడికల్ డైరెక్టర్ జనరల్ సర్జన్ వైస్ అడ్మిరల్ శంకర్ సుబ్రమణియన్, ఆర్మీ మెడికల్ డైరెక్టర్ జనరల్ లెఫ్టెనెంట్ జనరల్ మురళీధరన్, ఢిల్లీ ప్రభుత్వ క్యాబినెట్ మంత్రి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ పంకజ్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

## కనులపండగగా శ్రీపోలేరమ్మ అలయ ప్రధమ వార్షికోత్సవం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 27)

చిన్నగంజాం మండలంలోని మున్నంవారిపాలెం నందు నూతనంగా నిర్మించిన గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి ప్రధమ వార్షికోత్సవన్ని మున్నంవారిపాలెం కాపులు, ఎంప్లాయిస్ యూనియన్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ



ఆధ్వర్యంలో అలయాన్ని ప్రత్యేక పూలాలంకరణతో, విద్యుత్ ద్వీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం గ్రామంలోని మహిళలు పసుపు కుంకుమతో, నీటి బిందెలతో అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అగమ పండితుల ఆధ్వర్యంలో హోమంన్ని నిర్విఘ్నంగా భక్తుల అధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన వారితో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మావారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక వాహనాలపై కొలువుదీర్చి, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవంగా ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మందికి ఉచిత అన్న ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, మహిళలు, యవకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగపూర్‌లో సెకండరీ స్కూల్ నుంచే స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ

### తర్లుపాడు జడ్పీ పాఠశాల హెచ్ఎం ముత్తోజ్ సుధాకర్



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 27)

సింగపూర్‌లో సెకండరీ స్కూల్ నుంచే స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు జడ్పీ పాఠశాల హెచ్ఎం ముత్తోజ్ సుధాకర్ అన్నారు. శనివారం ఆయన



పాత్రికేయులతో మాట్లాడారు. ఇటీవల కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని అగ్రస్థానంలో ఉంచాలన్న ఆకాంక్షతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు కొందరు ప్రధానోపాధ్యాయులు విద్యారంగాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్య వ్యవస్థలో వినూత్న మార్పులతో విద్యారంగాన్ని తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో సింగపూర్ విద్యావ్యవస్థను మన రాష్ట్రంలో కూడా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. దీంతో మన రాష్ట్రంలో కూడా సింగపూర్‌లోని అక్కడి విద్యావిధానాల పై అవగాహన కలిగించుకొని వచ్చిన తరుణంలో నేడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం సుధాకర్ పలు విషయాలు తెలియజేశారు. సింగపూర్ తరహాలో ప్రాథమిక స్థాయి నుంచే నొకేషనల్, ఎడ్యుకేషన్, స్కిల్, డెవలప్మెంటుకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా యువతకు నాణ్యమైన ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో సెకండరీ స్థాయి నుంచి పరిశ్రమలతో అనుసంధానించి శిక్షణ ఇవ్వడం వల్ల చదువు పూర్తి అయిన వెంటనే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మన రాష్ట్రంలో కూడా ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా కోర్సులు డిజైన్‌లు చేయాలన్నారు. విశాఖ రీజియన్‌లో మెరుగైన బీచ్ మేనేజ్మెంట్, గోదావరి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్, కొబ్బరి పరిశ్రమ, అమరావతిలో లాజిస్టిక్స్ ఏఐ ట్రాఫిక్ కంట్రోల్, రాయలసీమలో రెన్యూవబుల్ ఎనర్జీ, మోటార్ వెహికల్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటి డిప్లమో కోర్సులు తెచ్చి ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇస్తే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు అత్యధిక స్థాయిలో లభిస్తాయన్నారు.

# కలెక్టరేట్ ను దిగ్బంధించిన పొగాకు రైతులు
# క్వింటాకు సరాసరిన రూ.25 వేలు ఇవ్వాలి

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1000 కోట్లు నిధుల కేటాయించి, ప్రభుత్వ రంగ సంస్థలచే కొనుగోలు చేయించాలని డిమాండ్**
**చివరకు సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో చర్చించిన కలెక్టర్**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 27)

గత మూడు రోజులుగా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా నాలుగో రోజున శనివారం వందలాది మంది పొగాకు రైతులు కలెక్టర్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలకు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమాన్‌రెడ్డి, పమిడి వెంకట్రావులు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ గత మూడు రోజులుగా పొగాకుకు గిట్టుబాటు ధరల కోసం పొగాకు రైతులు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడితే రాష్ట్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేదన్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు వేయడం కేంద్రాలలో రోజురోజుకు ధరలు పతనం అవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు వ్యాపారుల ఒత్తిడికి తలోగ్గి, పొగాకు కొనుగోలుకు రూ.1000 కోట్లు నిధులు కేటాయించలేదని, ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలోకి దించలేదని విమర్శించారు. ఇదే పద్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే తాము కలెక్టరేటను ముట్టడించామని పేర్కొన్నారు. అనంతరం ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి పాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు డివిఎన్ స్వామి, సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచే రైతుల పంటల గిట్టుబాటు ధరల కోసం రూ.1000 కోట్లు నిధులు కేటాయించి, ప్రభుత్వ రంగ సంస్థలచే కొనుగోలు చేయించకపోవడం దుర్మార్గమన్నారు. పొగాకు వ్యాపారుల చేతుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలు బొమ్మలు గా మారాయని ఎద్దేవా చేశారు. ఢిల్లీ రైతుల ఉద్యమస్ఫూర్తితో పొగాకు రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేసినప్పుడే, పొగాకు గిట్టుబాటు ధరలు సాధించుకోవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కలెక్టరేట్ మెయిన్ ఇన్, అవుట్ గేట్లు మూసివేత ఈ సందర్భంగా రైతులు కలెక్టర్ కార్యాలయం మెయిన్ గేటును దాదాపు గంటన్నర పాటు మూసివేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కలెక్టర్ చర్చలకు రావాలని రైతు నాయకులకు సమాచారం ఇవ్వటంతో మధ్యాహ్నం ఒకటిన్నర గంట సమయంలో కలెక్టర్ కార్యాలయం గేట్లను తెరిచారు. అనంతరం కలెక్టర్ తో చర్చలలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, పమిడి వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ లలిత కుమారి, జిల్లా నాయకులు సివిస్ సాగర్, నాయకులు అబ్బూరి









వెంకటేశ్వర్లు, నాంచార్లు, నల్లూరి రామచంద్రరావు, వెంకట్రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోళ్లలో పారదర్శకత లేదు**

కలెక్టర్ రాజాబాబు రైతులతో చర్చ సందర్భంగా కలెక్టర్ రాజా బాబు మాట్లాడుతూ తాము పొగాకు వేలం కేంద్రాలను పరిశీలించామని, పొగాకు కొనుగోలు లో పారదర్శకత లేనట్లు గుర్తించామన్నారు. పొగాకు కొనుగోలు సజావుగా జరిగేందుకు, నో బిడ్ లు లేకుండా చేసేందుకు, నాణ్యమైన పొగాకు ధర కల్పించేందుకు తానే నేరుగా పర్యవేక్షిస్తానని ఈ సందర్భంగా రైతు నాయకులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. అందుకుగాను అన్ని పొగాకు వేలం కేంద్రాలలో ప్రత్యేక అధికారులను నియమిస్తామని, ఈ కమిటీలలో సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘం నాయకులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కోరారు. ఒక కలెక్టర్‌గా ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు న్యాయం చేసేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఈ సందర్భంగా రైతు నాయకులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.

**ప్రభుత్వ రంగ సంస్థలచే పొగాకును కొనుగోలు చేయించాలి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలంటూ కలెక్టర్‌ను కోరిన రైతు ప్రతినిధులు**

గత ఏడాది కంటే పొగాకును అతి తక్కువ ధరలకే పొగాకు కొనుగోలు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు చేసి రైతుల శ్రమను దోచుకుంటున్నారని ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని రూ.1000 కోట్లు నిధులు కేటాయించి, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయించటం, సరాసరిన పొగాకును క్వింటా రూ.25 వేలకు కొనుగోలు చేసినప్పుడే పొగాకు రైతులు సంక్షోభం నుండి గట్టున పడతారని, ఆ వైపుగా





ప్రభుత్వానికి కలెక్టర్ సిఫార్సు చేయాలని రైతు ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. వేలం కేంద్రాలలో పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ గురించి, ధరల గురించి, పారదర్శకంగా అధికారులు రైతు సంఘాల నాయకులకు, రైతులకు సమాచారం ఇచ్చారా లేదా అని తెలుసుకుని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 27)

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి), జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గురునాథ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గేట్ ముందు విద్యార్థులతో బైఠాయించారు. డీఈఓ వచ్చి సమాధానం చెప్పాలంటూ పట్టుబట్టారు. కొద్దిసేపు నినాదాలు చేసిన అనంతరం మూకుమ్మడిగా లోపలికి వెళ్లేందుకు వారు ప్రయత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎబివిపి శ్రేణులు, పోలీసులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వారు బైఠాయించారు. ఒంగోలు తాలూకా సిఐ విజయ్ కృష్ణ వారితో మాట్లాడారు. డీఈఓ కాన్ఫరెన్స్‌లో ఉన్నారని, ముగ్గురిని లోపలికి పంపిస్తామని సీఐ చెప్పి వారిని అక్కడ నుండి పంపించేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కన్వీనర్ గురునాథ్, నగర సహకార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, మార్కాపురం నగర కార్యదర్శి వెంకటయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగ చరణ్, తదితరులు పాల్గొన్నారు.







## కడప అటవీ శాఖ కార్యాలయంలో కడప సిటీ ఫారెస్ట్ నర్సరీ



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జూన్ 27)

కడప అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్ అటవీ శాఖ అభివృద్ధిలో భాగంగా కడప సిటీ ఫారెస్ట్ నర్సరీ, వన సుధ (తాగునీరు), విశ్రాంతి గదులు నూతనంగా నిర్మించి, అతిథి గృహం పునరుద్ధరణ చేసి వాటిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ప్రజలకు వివిధ రకాల మొక్కల నర్సరీ మారుతీ నగర్‌లోని జిల్లా అటవీ కార్యాలయ ప్రాంగణంలో అందుబాటులో ఉండేలా "కడప సిటీ ఫారెస్ట్ నర్సరీ" ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నర్సరీలో టేకు, సీతాఫలం, నేరేడు, ఉసిరి, జామ, వేప, కానుగ, ఎర్రచందనం, తాండ్ర, మారేడు, వెదురు వంటి మొక్కలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదనంగా సీతా, అశోక వంటి అరుదైన జాతుల మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కొన్ని మొక్కలు తక్కువ ధరకు అందించబడతాయని, భవిష్యత్తులో మరిన్ని అరుదైన జాతుల మొక్కలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. కడప జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మొక్కలను నాటి పచ్చదనం పెంపొందించడంలో భాగస్వాములు కావాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్ పిలుపునిచ్చారు.



## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 27)

మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లె నందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం వెలిగొండ పనులు పరిశీలించేందుకు, గిద్దలూరు నందు సంజీవని కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి గులాబి పువ్వు అందజేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# లోకేష్ సారథ్యంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు





చిన్నారుల భవిష్యత్తు కోసం ఎక్కువగా నిధులు కేటాయింపు

ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్న మంత్రి లోకేష్

ఆడబిడ్డల చదువుల పై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి

ఎమ్మెల్యే ఇంటూరి పిలుపు

జి మేకపాడులో రూ.2.6 కోట్లతో నిర్మించిన

బాలికల హాస్టల్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 27)

రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ పథకంలో భాగంగా కందుకూరు మండలం జి మేకపాడు ఆదర్శ పాఠశాలలో రూ.2.62 కోట్ల రూపాయలతో బాలికల హాస్టల్ కోసం నిర్మించిన రెండంతస్తుల భవనాన్ని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. అనంతరం అధికారులు, నాయకులతో కలిసి హాస్టల్ భవనంలో ప్రతి రూమును నాగేశ్వరరావు పరిశీలించారు. మొత్తం 100 మంది విద్యార్థినులు ఉండేందుకు వీలుగా అన్ని వసతులతో చక్కగా నిర్మించారని ఎమ్మెల్యే మెచ్చుకున్నారు. ఆదర్శ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఆట స్థలాన్ని చదును చేయడం, త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్, సీసీ కెమెరాలు ఏర్పాటు, పాఠశాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం, ఆవరణలో జంగిల్ క్లియరెన్స్, తదితర సమస్యలను ప్రిన్సిపల్ నయోమి ఎమ్మెల్యేకి దృష్టికి తీసుకురాగా, త్వరలోనే వాటిని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇంకా గ్రామం నుంచి చెన్నారెడ్డిపాలెం వరకు తారురోడ్డు నిర్మాణం, గ్రామానికి కిలోమీటరు దూరంలోని గుడిపాడు నుంచి సాగర్ కాలువ పొడిగింపు పనులను కూడా ఏడాది పూర్తి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి లోకేష్ తీసుకొచ్చిన సంస్కరణలతో, రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలో విస్తీర్ణత శాతం పెరిగింది. ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. లోకేష్ సారథ్యంలో ప్రతి పాఠశాలలో అన్నిరకాల మౌలిక వసతులు ఏర్పాటయ్యాయి. జి మేకపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు గత ఏడాది మంచి ఫలితాలు సాధించినందుకు నా అభినందనలు. జిల్లాలోని మిగతా పాఠశాలల కంటే, ఇక్కడ ఉత్తీర్ణత శాతం అద్భుతంగా ఉంది. ఉపాధ్యాయులు చక్కగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది ముగ్గురు ఐఐటి సీట్లు సాధించటం సంతోషంగా ఉంది. అలాగే ఇక్కడి పాఠశాలలో ఆడబిడ్డలకు పూర్తి రక్షణ ఉంటుంది. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆడపిల్లల చదువులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తా – ఎమ్మెల్యే

జి.మేకపాడు గ్రామంలో రెవిన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. నియోజవర్గంలో భూ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ స్వయంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. వారం రోజుల్లో కందుకూరు మండలంలో జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో, ఇక్కడ సమస్యలపై అర్జీలు ఇస్తే త్వరగా పరిష్కరించే బాధ్యత తీసుకుంటాను. వనరులు దోచుకొని, కోట్లు కొల్లగొట్టిన వైసిపి ప్రభుత్వానికి, ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్న కూటమి ప్రభుత్వానికి తేడా గమనించాలి. నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధి మీ కళ్ళముందే కనిపిస్తోంది. రాబోయే మూడేళ్లలో వేగంగా అభివృద్ధి పనులు చేపట్టి, 2029 ఎన్నికల్లో మీ ఆశీర్వాదం ఆశీర్వాదం కోసం మళ్లీ వస్తాను... అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు తెలియజేశారు. అంతకుముందు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరావుకి మేళతాళాలతో గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నయోమి, తహసిల్దార్ మురళి, మండల టిడిపి అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, కందుకూరు పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, ఏపీడబ్ల్యుఈడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, గ్రామపార్టీ అధ్యక్షుడు వరికూటి మల్లికార్జున, సీనియర్ నాయకుడు లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాదాని రవీంద్రబాబు, గ్రామనాయకులు ఉప్పతి శ్రీను, గూడపాటి భార్గవ్, నేలపాటి దావీదు, కాలే నాగార్జున, యోగయ్య, యల్లమంద, క్లస్టర్ ఇంచార్జ్ లు గొంది నర్సింగరావు, వంకాయలపాటి మాల్యాద్రి, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మెండా లెనిన్, మండల నాయకులు మాదాల రవి, పచ్చవ తిరుపతిస్వామి, చిరంజీవి రెడ్డి, సోమినేని కొండలరావు, బైరపునేని రమణయ్య, ముప్పాళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు కృషి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.68 కోట్లతో ఆర్డిఎస్ఎస్ స్కీం ద్వారా పనులు

మన్నేటికోటలో 33/11 కెవి సబ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

రూ.3.5 కోట్లతో ఏడాదిలో నిర్మాణం

త్వరలో 3 చోట్ల సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నాం

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 27)

రూ.3.5 కోట్ల రూపాయలతో ఉలవపాడు మండలం మన్నేటికోట వద్ద నిర్మించిన 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు అయిన సబ్ స్టేషన్ వల్ల మన్నేటికోట, ఆత్మకూరు, జాతీయ రహదారి ప్రాంతానికి పూర్తిగా విద్యుత్ సమస్యలు తొలగిపోయాయని చెప్పారు. గతంలో ఉలవపాడు సబ్ స్టేషన్ నుంచి ఈ ప్రాంతంలోని సుమారు 2 వేల సర్వీసులకు విద్యుత్ సరఫరా జరిగేదన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ తీర్చేందుకు, అలాగే నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం కొత్తగా సబ్ స్టేషన్ నిర్మించినట్లు చెప్పారు. కొత్త సబ్ స్టేషన్ వల్ల గృహాలకు 24 గంటలు, అలాగే వ్యవసాయానికి 9 గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో కొత్తగా రెండు 33/11 కె.వి ఫీడర్ల ఏర్పాటుకు 2 కిలోమీటర్లు, నాలుగు 11 కె.వి ఫీడర్ల ఏర్పాటుకు 6 కిలోమీటర్ల పొడవున కొత్త లైన్ల నిర్మాణం జరిగిందన్నారు. నియోజకవర్గంలో యర్రారెడ్డిపాలెం, చుండి, పలుకూరు గ్రామాల వద్ద కొత్తగా 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గౌరవ మంత్రివర్యులు గొట్టిపాటి రవి, మన్నేటికోట సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారని, ఆయన సహకారంతో ఏడాదికల్లా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. నియోజకవర్గంలో రైతులకు మేలు చేసేందుకు కొత్తగా 20 ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. ?? కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ,పథకం ద్వారా కందుకూరు నియోజకవర్గంలో 68 కోట్ల రూపాయలతో పనులు మొదలు కాగా, ఇప్పటికే 40 కోట్ల రూపాయలు పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. పాత స్తంభాల స్థానంలో కొత్తవి మార్చడం, కొత్తగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయటం, పాత లైన్ల స్థానంలో కొత్త లైన్లు వేయడం లాంటి పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈ పథకం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పారు. ఈఈ కట్టా వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ సూర్య ఘర్ పదకం ద్వారా ఎస్సీ ఎస్టీ కాలనీల్లో ఉచితంగా సోలార్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారని చెప్పారు. మిగిలిన వారు సబ్సిడీతో పథకాన్ని అమలు చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసిడిసిఎల్ ఈఈ వీరయ్య, డిఈ యుగంధర్, ఏఈ సాయిబాబా, కన్స్ట్రక్షన్స్ ఈఈ నాగేశ్వరరావు, డిఇ సత్యనారాయణ, ఏఈ రమేష్, మండల టిడిపి అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, మాజీ సర్పంచ్ పులివర్తి బసవయ్య నాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిమ్మిరి వంశీకృష్ణ, గ్రామ నాయకులు చిమ్మిరి మోహన్ రావు, ఏలూరి బాలమురళి, నల్లూరి రామానాయుడు, లేళ్లపల్లి వెంకటస్వామి, గొత్తుల జనార్ధన్, వెంకటేశ్వర్లు, మందాడి రామారావు, రావినూతల రమేష్, తదితరులు పాల్గొన్నారు.









## కనిగిరిలో ఆటిజం భవన నిర్మాణనికి స్థల పరిశీలన రాష్ట్ర సహిత విద్య విభాగం సమగ్ర శిక్షణ ఏఎస్పీడీ రవీంద్రారెడ్డి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 27)

రాష్ట్ర సహిత విద్యా విభాగం సమగ్ర శిక్ష ఏఎస్ పిడి రవీంద్రనాథ్‌రెడ్డి దివ్యాంగ చిన్నారులకు కొత్తగా నిర్మాణం చేపడుతున్న ఆటిజం భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఆటిజం చిన్నారుల భవనాన్ని అతి త్వరగా పూర్తి చేయాలని మోనిటరింగ్ జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సహిత విద్య విభాగమందు ఇంటి వద్ద అభ్యసిస్తున్న చిన్నారులకు అందుతున్న సేవా కార్యక్రమాల గురించి మండల రిసోర్స్ టీచర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పరికరాలు, అలవెన్స్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో భవితా పాఠశాల నిర్వహణ గురించి సలహాలు, సూచనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఎస్‌పురం మండల విద్యాశాఖ అధికారి రాజాల కొండారెడ్డి, బాలికల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఐఈఆర్‌పి కే గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పివిఆర్ బాయ్స్ స్కూల్లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు సన్మానం, బుక్స్ పంపిణీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 27)

ఒంగోలు సిటిజన్స్ క్లబ్, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ శిఖకొల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం డాన్ టూ డస్క్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాటూరి రాఘవేంద్రరావు, కొత్తూరు శ్రీనివాసరావు, సత్యనారాయణ ఆఫీసర్స్ క్లబ్ పిఎస్‌టిలు, డివోలు పాల్గొనని పివిఆర్ బాయ్స్ హై స్కూల్లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. అనంతరం బుక్స్, పెన్స్, పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సిటిజన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## బాబురావుకు మాతృవియోగం



(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జూన్ 27)

కొనకనమిట్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్ మాతృమూర్తి మూరబోయిన కలమ్మ (96) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యం కారణంగా ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. శనివారం ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు.

## పొదిలి మండల విద్యాశాఖాధికారిగా బాదం వెంకటేశ్వరరెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 27)

పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బాదం వెంకటేశ్వరరెడ్డికి పొదిలి మండల విద్యాశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గుంటూరు ప్రాంతీయ సంయుక్త విద్యాశాఖ సంచాలకులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎంఈఓ 1గా ఉన్న ఎం శ్రీనివాసులు ఈ పాటికే మార్కాపురం జిల్లా డిప్యూటీ డీఈఓ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో 2026 జులై 1వ తేదీ నుంచి బాదం వెంకటేశ్వరరెడ్డి నియామకం అమలులోకి రానుంది. బాదం వెంకటేశ్వరరెడ్డి నియామకం పట్ల మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.